కలం
kalamdaily.com
Follow on: Kalamtelugu
ప్రజల గళం...
ఆదివారం ● 12-04-2026
పేజీలు: 3

360° SINGLE TOPIC

నా లైఫ్.. నా ఇష్టం!

# జెన్ జీ.. తగ్గేదేలే!

## కెరీర్ అయినా.. మ్యారేజీ అయినా.. నో కాంప్రమైజ్

## ఏదైనా సరే నచ్చితే ఓకే.. నచ్చకపోతే బ్రేకప్

## పనిలో టైమ్ అంటే టైమ్.. ఎక్స్‌ట్రా వర్క్‌కు నో

## ఒత్తిళ్లకు తలొగ్గని నైజం.. అంతా టేక్ ఇట్ ఈజీ పాలసీ



"హలో సార్..! నాకు బ్రేకప్ అయింది. నన్ను నేను తిరిగి మేకప్ చేసుకోవాలి. పది రోజులు లీవ్ కావాలి" ..ఇదీ ఇటీవల బాస్‌కు ఓ ఎంప్లాయీ పెట్టుకున్న లీవ్ అప్లికేషన్!

"సార్, మీరు ఏమన్నా అనుకోండి. వీకాఫ్ రోజు మాత్రం డ్యూటీకి రాలేను. నా బయోలజికల్ సిస్టమ్ దెబ్బతింటుంది. కాదూ కూడదూ అంటే.. రిజైన్ చేయడానికి రెడీ!" ..ఇదీ ఓ ప్రైవేట్ కంపెనీలో హెడ్‌తో యువ ఉద్యోగి వాదన!

"అమ్మా.. నాన్నా..! మీకు చెప్పదలచుకున్నది ఒక్కటే!! నాకు ఇప్పుడప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు. కెరీర్ ముఖ్యం. మీ కాలం అమ్మాయిల్లా పెండ్లిచూపుల పేరిట ప్రతి ఒక్కడి ముందు తలవంచుకొని కూర్చోలేను. నాకు నచ్చినవాడిని, అదీ మీకు నచ్చజెప్పే చేసుకుంటా. దట్స్ ఆల్!!" ... ఇదీ ఓ యువతి నిర్ణయం!

వీళ్లంతా జెన్ జీలు! కెరీర్ అయినా, మ్యారేజీ అయినా.. దేనికీ కాంప్రమైజ్ కావడం లేదు. 'నా జీవితం.. నా ఇష్టం' అనే రీతిలో డెసిషన్ తీసుకుంటున్నారు. పక్కా ప్లానింగ్‌తో అడుగులు వేస్తున్నారు. ఎవరికో నచ్చేలా కాకుండా వారికి నచ్చేలా కెరీర్‌ను, జీవితాన్ని తీర్చిదిద్దుకుంటున్నారు. వర్క్‌లో బాస్ వేధింపులను ఇసుమంతైనా సహించడం లేదు. ముఖం ముందే రిజైన్ లెటర్ పడేస్తున్నారు. ఈ జాబ్ కాకపోతే మరోటి అన్న ధీమాలో ఉంటున్నారు. ఏదీ దొరక్కపోతే .. రీల్స్ అయినా చేసుకుంటామన్న కాన్ఫిడెన్స్‌తో బతికేస్తున్నారు. మానసిక ఒత్తిళ్లను దరిచేరనీయడం లేదు. కోపమొచ్చినా, తాపమొచ్చినా.. అన్నింటినీ లైట్ తీసుకుంటున్నారు. కొందరు అందివచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో చెడుగుడు ఆడుకుంటున్నారు. సరికొత్త టూల్స్ డెవలప్ చేసి, కొత్తవాళ్లకు ఉపాధి కల్పిస్తున్నారు. జెన్ జీ లైఫ్ అండ్ కెరీర్‌పై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం...

- సెంట్రల్ డెస్క్, కలం

### ఎవరీ జెన్ జీ?

1997-2012 మధ్య పుట్టిన వారిని జనరేషన్ జడ్ (జెన్ జీ) అంటారు. వీళ్లను డిజిటల్ ప్రపంచంలో పెరిగిన, వేగంగా ఆలోచించే, కొత్తదనం ఇష్టపడే యువతరం అని పేర్కొంటారు.



# రిలేషన్‌షిప్‌తో అండర్‌స్టాండింగ్

పెళ్లికి ముందు రిలేషన్‌షిప్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు జెన్ జీలు. ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడానికి ఇదొక మంచి అవకాశమని చెబుతున్నారు. పాత తరం లాగా కేవలం ఒకరిని ఒకరు చూసుకుని పెళ్లి చేసుకోవడం, ఆ తర్వాత ఇబ్బందులు వస్తే సర్దుకుపోవడం తమవల్ల కాదంటున్నారు. ఆడ, మగ అండర్‌స్టాండింగ్‌తో ఒకరిని ఒకరు అర్థం చేసుకుని, పెళ్లి అనే బంధంలోకి అడుగు పెడితేనే.. అదొక అందమైన జీవితం అవుతుందనే ఆలోచనలో ఉన్నారు.

రిలేషన్‌షిప్ విషయంలోనూ ప్రాక్టికల్‌గా, కాన్ఫిడెంట్‌గా ఉన్నారు జెన్ జీలు. ఒకరితో రిలేషన్‌షిప్ స్టార్ట్ చేశాక.. అది సెట్ అయితే ఓకే. లేదంటే అక్కడితో బై.. బై.. మరొకరితో టై అప్.

**సిచ్యుయేషన్‌షిప్:** ప్రస్తుతం జెన్ జీ మధ్య ఎక్కువగా వినిపిస్తున్న పదం ఇది. ఇది స్నేహానికి, ప్రేమకు మధ్యలో ఉండే ఒక రకమైన బంధం. పెళ్లి లేదా లాంగ్-టర్మ్ కమిట్‌మెంట్ వంటి బాధ్యతలు తీసుకోరు. ఒకరితో ఒకరు సమయం గడపడానికి ఇష్టపడతారు. తమ కెరీర్ లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు ఎలాంటి అడ్డు ఉండకూడదనేది వీళ్ల ఉద్దేశం.

**స్లో డేటింగ్:** ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలుసుకోవడం. ఫిజికల్ రిలేషన్‌షిప్ లేదా పెళ్లి వంటి పెద్ద నిర్ణయాల కంటే ముందు.. ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించడం.

**బెంచింగ్:** ఇదొక మోడర్న్ స్టైల్ డేటింగ్. నచ్చిన వాళ్లతో ఉంటూనే, వాళ్ల కంటే బెటర్ పర్సన్ దొరుకుతారేమోనని చూడడం. అవసరమైనప్పుడు ఇద్దరూ సరదాగా ఉంటూ, మిగతా సమయంలో బెంచ్ మీద వెయిటింగ్‌లో ఉంచడం.

**బ్రెడ్‌క్రంబింగ్:** ఎదుటి వ్యక్తికి కేవలం ఆశ చూపించడం. సంబంధాన్ని కంటిన్యూ చేసే ఉద్దేశం లేకపోయినా, అప్పుడప్పుడు మెసేజ్‌లు చేస్తూ లేదా ఫ్లర్ట్ చేస్తూ అవతలి వ్యక్తి తన గురించి ఆలోచించేలా చేయడం. అప్పుడప్పుడు కొద్దిపాటి అటెన్షన్ ఇవ్వడం.

**ఘోస్టింగ్:** ఏదైనా రిలేషన్‌షిప్‌లో ఉండి, హఠాత్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మాయమైపోవడం. ఫోన్ కాల్స్ ఎత్తకపోవడం, మెసేజ్‌లకు రిప్లయ్ ఇవ్వకపోవడం. ఒక రకంగా చెప్పాలంటే ఎదుటి వ్యక్తికి తాము ఉన్నామో లేదో తెలియనంతగా కనపడకుండా పోవడం.





# మ్యారేజ్‌కి తొందరేం లేదు

పెళ్లి విషయంలో జెన్ జీలు తొందరపడట్లేదు. ఇంట్లో వాళ్లు ఎంతగా అడిగినప్పటికీ, ఆలోచనా విధానాన్ని మార్చుకోవడం లేదు. ట్వంటీస్‌లో పెళ్లి చేసుకోవడం సరైన సమయం కాదని అంటున్నారు. పెళ్లికి 30, 30+ ఏజ్ సరైన సమయమని భావిస్తున్నారు. లైఫ్‌లో అన్ని విధాలా సెటిల్ అయ్యాకే మ్యారేజ్ మంచిదని చెబుతున్నారు. గత తరాల మాదిరి ఒక వయసు రాగానే పెళ్లి, పిల్లలు అనే కాన్సెప్ట్‌ను పక్కన పెడుతున్నారు. జెన్ జీలు పెళ్లిని పూర్తిగా వ్యతిరేకించడం లేదు. కానీ అది జీవితానికి స్టార్టింగ్ లైన్ కాదు.. అన్నీ సెట్ అయ్యాక చేరుకునే ఫినిషింగ్ లైన్.. అని భావిస్తున్నారు.

**టైమ్ ఇంపార్టెంట్:** పెళ్లి విషయంలో టైమ్ ఇంపార్టెంట్ అంటున్నారు జెన్ జీలు. చాలామంది 30 ఏండ్లు నిండాక పెళ్లి చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు.

**కెరీర్:** పెళ్లి కంటే ముందు కెరీర్ మీద ఫోకస్ పెడుతున్నారు. అందులో సరైన గ్రోత్ వచ్చాకే మ్యారేజ్ గురించి ఆలోచిస్తున్నారు.

**ఫైనాన్షియల్ స్టెబిలిటీ:** పెళ్లికి ముందే అన్ని విధాలుగా సెటిల్ అవ్వాలని జెన్ జీలు అనుకుంటున్నారు. అప్పులు, ఈఎంఐల బాధలు ఉండొద్దని కోరుకుంటున్నారు.

**ఖర్చుకు నో:** గతంలో లాగా పెళ్లికి వేలాది మందిని పిలిచి భారీగా ఖర్చు చేయడం కంటే, తమకు నచ్చిన అతి కొద్దిమంది సమక్షంలో చేసుకోవడానికి ఇష్టపడుతున్నారు. సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూనే, వాటికి మోడర్న్ ట్రెండ్స్ జోడిస్తున్నారు. హల్దీ, మెహందీ, సంగీత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**సోలో లైఫ్‌కూ జై:** పెళ్లి బంధంపై జెన్ జీలకు నమ్మకం ఉన్నప్పటికీ.. సమాజంలోని విడాకుల రేట్లు, ఆర్థికపరమైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొంతమేర భయపడుతున్నారు. 'సంతోషంగా లేని బంధం కంటే ఒంటరిగా ఉండటమే మేలు' అనే ధోరణితో కొందరు సోలో లైఫ్‌కూ జై కొడుతున్నారు.



# ఆ మూడు ఉంటేనే ఉద్యోగానికి ఓకే..

జాబ్ విషయంలో పాత తరాల కంటే పూర్తి భిన్నమైన దృక్పథాన్ని కలిగి ఉన్నారు జెన్ జీలు. ఉద్యోగం కేవలం బతకడానికి మార్గం కాదని అంటున్నారు. 'బతకడానికి పని చేయడం కాదు.. ఇష్టపడి పని చేయాలి' అనే సూత్రాన్ని నమ్ముతున్నారు. పనికి తగ్గ జీతం, గౌరవం, స్వేచ్ఛ.. ఈ మూడూ ఉండాలని చెబుతున్నారు. అట్లయితేనే ఉద్యోగం చేస్తున్నారు.. లేదంటే మానేయడానికి కూడా వెనుకాడటం లేదు. ఈ జాబ్ కాకపోతే, ఇంకో జాబ్.. అనే ధోరణితో ఉన్నారు.

**టైమ్:** వర్క్ టైమ్ విషయంలో పక్కాగా ఉంటారు. ఎక్స్‌ట్రా అవర్స్‌కు ఒప్పుకోరు. రోజంతా ఆఫీసులోనే ఉండాలా, మాకంటూ లైఫ్ ఉండదా? అని బాస్‌లను ప్రశ్నిస్తున్నారు.

**ఫ్లెక్సిబిలిటీ:** వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా హైబ్రిడ్ మోడల్‌కు మొదటి ప్రాధాన్యం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆఫీసులో కూర్చోవడం కంటే.. పని ఎక్కడి నుంచి చేసినా ఫలితం ముఖ్యం అని నమ్ముతారు.

**మెంటల్ హెల్త్:** మానసిక ప్రశాంతతను దెబ్బతీసే 'టాక్సిక్' పని వాతావరణం ఉంటే, ఎంత జీతం ఉన్నా సరే.. ఆ ఉద్యోగాన్ని వదిలేయడానికి వెనుకాడరు.

**పర్పస్:** కేవలం జీతం కోసం కాకుండా, చేసే జాబ్‌తో ఉపయోగం ఉందా? లేదా? అని ఆలోచిస్తారు. ఉద్యోగంలో కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉందో? లేదో? అని నిశితంగా పరిశీలిస్తారు.

**క్విక్ గ్రోత్:** 'మెల్లగా ప్రమోషన్ వస్తుందిలే' అని ఓపికగా వేచి చూడటం జెన్ జీల నైజం కాదు. చేసే పనికి వెంటనే గుర్తింపు, ఫీడ్‌బ్యాక్ ఆశిస్తారు. ఒకే కంపెనీలో 10-20 ఏళ్లు ఉండిపోవడం కంటే, మెరుగైన అవకాశం వస్తే వెంటనే మరో కంపెనీకి మారిపోవడం బెటర్ అనుకుంటున్నారు.

**టెక్నాలజీతో అటాచ్:** కొత్త టెక్నాలజీతో ఈజీగా పని చేయడానికి ఇష్టపడతారు. పాత పద్ధతుల్లో పని చేయడాన్ని అసహ్యించుకుంటారు. ఏ పనినైనా స్మార్ట్‌గా, వేగంగా చేయడంపైనే దృష్టి ఉంటుంది.

## తండ్రికే జాబ్ ఇచ్చిన కొడుకు..

కేరళకు చెందిన రౌల్ జాన్ అజు చిన్నప్పటి నుంచే ఏఐ నేర్చుకోవడం మొదలుపెట్టాడు. 16 ఏండ్లు వచ్చే సరికి ఎన్నో ఏఐ టూల్స్ నేర్చుకుని, స్టార్టప్ కంపెనీ స్థాపించాడు. అందులో తన తండ్రికే జాబ్ ఇచ్చాడు.



## బ్రేకప్ సార్.. లీవ్ ప్లీజ్

లవర్‌తో బ్రేకప్ అయిందని, కొన్ని రోజులు లీవ్ కావాలంటూ బాస్‌కు ఓ ఉద్యోగి మెయిల్ పెట్టాడు. 2025 అక్టోబర్‌లో జరిగిన ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గురుగ్రామ్‌కు చెందిన నాట్ డేటింగ్ మ్యాట్రిమోని ప్లాట్‌ఫామ్‌లో పని చేస్తున్న ఓ ఉద్యోగి ఈ మెసేజ్ చేశాడు. ''నాకు ఇటీవల బ్రేకప్ అయింది. వర్క్ మీద ఫోకస్ చేయలేకపోతున్నాను. షార్ట్ బ్రేక్ కావాలి. 10 రోజులు లీవ్ ఇవ్వండి'' అని బాస్‌కు ఈ-మెయిల్ చేశాడు. ఆ ఈ–మెయిల్ స్క్రీన్ షాట్‌ను కంపెనీ సీఈవో జస్వీర్ సింగ్ సోషల్ మీడియాలో పోస్టు చేసి.. 'జెన్ జీలు డైరెక్టుగా నిజం చెప్పేస్తారు' అంటూ క్యాప్షన్ ఇచ్చారు.







# కెరీర్‌పై క్లారిటీ

జెన్ జీలు కెరీర్‌పై చాలా క్లారిటీతో ఉంటున్నారు. గత తరాల మాదిరి.. తల్లిదండ్రులు చెప్పారని మెడిసిన్, బంధువులు చెప్పారని ఇంజనీరింగ్ చేయట్లేదు. ఎవరేం చెప్పినా, ఎన్ని సలహాలు ఇచ్చినా.. చివరికి ఏది ఇష్టమో అదే చేస్తున్నారు. ఏ కోర్సు చేస్తే భవిష్యత్తు, గ్రోత్ ఉంటుందో ఆలోచిస్తున్నారు. అసలు చదవడమే ఇష్టం లేకపోతే కొత్త దారులు వెతుక్కుంటున్నారు. రెగ్యులర్ చదువులకు స్వస్తి చెప్పి, వైవిధ్యమైన కెరీర్ ఎంచుకుంటున్నారు.

**స్టార్టప్స్:** విభిన్నమైన ఆలోచనలతో కొందరు చిన్న వయసులోనే స్టార్టప్స్ స్థాపించి సక్సెస్ అవుతున్నారు. ఏఐని వాడుకుని టెక్నాలజీతో ఆడుకుంటున్నారు.

**కంటెంట్ క్రియేటర్లు:** కొందరు కంటెంట్ క్రియేటర్లుగా మారుతున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వేదికగా ఇన్‌ఫ్లూయెన్సర్లుగా ఎదుగుతున్నారు.



## మెంటల్ హెల్త్ ముఖ్యం

జెన్ జీలు మెంటల్ హెల్త్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫిజికల్ హెల్త్‌తో పాటు మెంటల్ హెల్త్ కూడా ముఖ్యమని చెబుతున్నారు. జాబ్, రిలేషన్‌షిప్, మ్యారేజ్.. ఏ విషయంలోనైనా సరే మెంటల్ హెల్త్‌కు ఇబ్బందులు ఉండొద్దన్నది వీళ్ల ఉద్దేశం. ఒకవేళ ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆ జాబ్ మానేస్తున్నారు. రిలేషన్‌షిప్/ మ్యారేజ్ బ్రేక్ చేసుకుంటున్నారు. జీవితం ప్రశాంతంగా, సాఫీగా సాగాలని నమ్ముతారు. ఈ డిజిటల్ సమాజంలో యాంగ్జయిటీ, ఒత్తిడి పెరిగిపోతున్నది. అందుకే మెంటల్ హెల్త్‌పై అవగాహనతో ఉంటారు. దాని గురించి బయటకు చెప్పుకోవడానికి భయపడరు.



## ఏదైనా టేక్ ఇట్ లైట్..

జెన్ జీలు దేనికీ పెద్దగా ఆందోళన చెందరు. 'టేక్ ఇట్ లైట్' అన్నట్టుగా ఉంటారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంగారుపడిపోయి ఆగమాగం అయిపోరు. 'జరిగేది ఎలాగూ జరుగుతుంది.. దాని గురించి ఆలోచించి ఒత్తిడి పెంచుకోవడం ఎందుకు?' అనే ఫిలాసఫీని నమ్ముతారు. ఫెయిల్యూర్స్‌కు కుంగిపోరు.. నెక్స్ట్ ఏంటి? అని ఆలోచిస్తారు. 'రేపు ఏం జరుగుతుందో తెలియదు.. ఉన్నంతలో హ్యాపీగా ఉండాలి' అని అంటారు.

## ఈక్వాలిటీకి జై

'అబ్బాయి మాత్రమే ఖర్చు పెట్టాలి' లేదా 'అమ్మాయి మాత్రమే వంట చేయాలి' అనే పాత ఆలోచనలు జెన్ జీ జంటలలో తగ్గిపోతున్నాయి. అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ ఖర్చులు షేర్ చేసుకుంటున్నారు. ఇద్దరూ కలిసే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇంటి పని, వంట పని, జాబ్, పిల్లల బాధ్యతలు ఇద్దరూ చూసుకుంటున్నారు.

## రియాలిటీ లైఫ్

జెన్ జీలు ఎక్కువ ఆశావాదం, నిరాశవాదంతో ఉండరు. రియాలిటీలో బతకడానికి ప్రయత్నిస్తారు. వాస్తవికతను అంగీకరిస్తారు. సుఖం, దుఃఖం, కష్టం, నష్టం సహజమని భావిస్తారు.



## సెల్ఫ్ డిస్కవరీ

ట్రావెలింగ్‌కు జెన్ జీలు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ప్రపంచాన్ని చుట్టి రావడానికి ఇష్టపడుతున్నారు. తమను తాము అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.